4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 24 మే 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## పాలస్తీనాకు మద్దతు

**పాలస్తీనా** సమస్యపై ఇటీవల అంతర్జాతీయంగా రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందులో మొదటిది, ఐక్యరాజ్య సమితిలో పూర్తిస్థాయి సభ్యత్వం కల్పించే ప్రయత్నాలు మరోసారి ఊపందుకోవడం. రెండోది, పలు దేశాలు పాలస్తీనాకు దౌత్యపరంగా గుర్తింపు ఇవ్వడం. చిరకాలంగా ఇజ్రాయెల్ చేతుల్లో పీడనకు, గాజా యుద్ధంతో నరమేధానికి గురవుతున్న పాలస్తీనా ప్రజల హక్కుల పరిరక్షణలో ఇవి చాలావరకు సహాయకారి అవుతాయని చెప్పవచ్చు. పాలస్తీనాకు ఐరాసలో ప్రస్తుతం పరిశీలక హోదా మాత్రమే ఉన్నది. ఓటు హక్కు రావాలంటే శాశ్వత సభ్యత్వం ఉండాలి. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని సర్వ ప్రతినిధి సభ మే 10న భారీ మెజారిటీతో తీర్మానం చేసింది. అనుకూలంగా 143 ఓట్లు, వ్యతిరేకంగా 9 ఓట్లు పడటం గమనార్హం. 25 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. సుదీర్ఘకాలం పాలస్తీనీయులకు సంఘీభావంగా నిలిచిన భారత దేశం సహజంగానే తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసింది. ఈ పరిణామాల పట్ల ఇజ్రాయెల్ తీవ్ర అసహనానికి గురవుతున్నది. తీర్మానాన్ని అడ్డుకునేందుకు విఫలయత్నం చేసిన ఇజ్రాయెల్ ప్రతినిధి.. సర్వ ప్రతినిధి సభలో ఆగ్రహావేశాలతో ఊగిపోతూ, ఐరాస చార్టర్ ప్రతిని చించివేసి నిరసన తెలిపారు. మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్న మౌలిక ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఈ తరహా ప్రవర్తన ఏమాత్రం సరిపడదు. అమెరికా సరఫరా చేస్తున్న ఆయుధాలను అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధంగా ఆక్రమిత పాలస్తీనాలోని ప్రజల అణచివేతకు ఇజ్రాయెల్ ఉపయోగిస్తున్నదనే ఆరోపణల గురించి తీర్మానంలో ప్రస్తావించకపోవడం విమర్శలకు తావిచ్చింది. రకరకాల ఒత్తిళ్ల ఫలితంగా తీర్మానం కుదింపులకు లోనైంది.

ఈ తీర్మానంతో ఉన్నపళంగా పాలస్తీనాకు ఐరాస శాశ్వత సభ్యత్వం లభిస్తుందని చెప్పలేం. ప్రస్తుత పరిశీలక హోదాతో దఖలుపడిన హక్కులకు అదనంగా మరికొన్నిటిని కల్పించాలని తీర్మానంలో పేర్కొన్నారు. అదేవిధంగా సంపూర్ణ సభ్యత్వం కల్పించాలని భద్రతామండలికి సిఫారసు చేశారు. దీనిపై మండలి సానుకూల నిర్ణయం తీసుకుంటేనే అది సాధ్యమవుతుంది. అయితే మండలిలో ఈ వ్యవహారం అంత సులభంగా తెమిలే సూచనలు కనిపించడం లేదు. ఇదివరకే ఓసారి వీటోతో అడ్డుకున్న అమెరికా మరోసారి అదే పని చేస్తానని హెచ్చరిస్తుండటమే అందుకు కారణం.

మరో విడత తీర్మానం ఐరాసలో ఆమోదం పొందిన కొద్దిరోజులకే స్పెయిన్, ఐర్లాండ్, నార్వే దేశాలు పాలస్తీనాకు దౌత్యపరంగా గుర్తింపునిచ్చేందుకు ముందుకు రావడం సానుకూల పరిణామం. మాల్టా, స్లొవేనియా కూడా అందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఐరాస సభ్యత్వ తీర్మానం, ఐరోపా దేశాల 'గుర్తింపు' నిర్ణయం వల్ల తక్షణ ఫలితాలు ఉండకపోవచ్చు. కానీ, అంతకంతకూ ఇజ్రాయెల్ ఏకాకిగా మారుతున్నదనడానికి, పాలస్తీనాకు ప్రపంచ వ్యాప్తంగా మద్దతు పెరుగుతున్నదనడానికి ఇవి సూచికలుగా నిలుస్తాయి. 1948 నుంచి నలుగుతున్న ఈ సమస్యను ఇప్పటికైనా కొలిక్కి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత పాలస్తీనా ప్రాధికార సంస్థను సార్వభౌమాధికార ప్రభుత్వంగా ఆవిష్కరించడం ఒక్కటే పశ్చిమాసియా సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వగలదు.

# బరిగీసి నిలిచినం.. గెలిచినం



శ్రీధరరావు దేశ్‌పాండే

### విద్రోహం ఓడిపోయిన రోజు జూన్ 2 (రెండవ భాగం)



**ఆంధ్రోద్యమంతోనే విశాలాంధ్ర ఉద్యమం కూడా..:** విశాలాంధ్ర ఏర్పాటుకు ఆంధ్రులు ఎందుకు, ఎట్లా ఆతృతపడినారో విశ్లేషించుకోవాలి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి వేరుపడిన ఆంధ్ర రాష్ట్రం తెలంగాణ వనరులు లేకుండా మనుగడ సాగించలేదని వారికి ముందునుంచే తెలుసు. తెలంగాణను కలుపుకోకుండా గోదావరి, కృష్ణా నీళ్లపై ఆధిపత్యం సాధ్యపడదు. పారిశ్రామిక ప్రగతికి, విద్యుత్తు ఉత్పత్తికి కావలసిన బొగ్గు గనులు తెలంగాణాలోనే ఉన్నాయి. సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా నిర్మాణమై ఉన్న హైదరాబాద్ నగరం తమ చేతికి చిక్కాలంటే తెలంగాణను కలుపుకోవాలి. పోలీసు చర్య అనంతరం హైదరాబాద్ రాష్ట్రానికి బదిలీ అయిన లక్షలాది ఎకరాల నిజాం సర్ఫేఖాస్ భూములు, హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్న మిగులు నిధులు, విస్తారమైన ఉద్యోగ అవకాశాలు- ఇవన్నీ తమ ఆధిపత్యంలోకి రావాలంటే విశాలాంధ్ర ఏర్పాటు ఒక్కటే మార్గం. విశాలాంధ్ర నినాదం వెనుక ఈ విస్తరణ ఆకాంక్ష ఉన్నదని ప్రధాని నెహ్రూకి ఆనాడే తెలుసు కనుకనే 'విశాలాంధ్ర నినాదం వెనుక రాజ్యాన్ని విస్తరించుకోవాలన్న సామ్రాజ్యవాద భావాలున్నాయి' అని స్పష్టంగానే ప్రకటించాడు.

ఆంధ్రోద్యమంతో పాటు 1936 నుంచే విశాలాంధ్ర భావ ప్రచారం ప్రారంభమైందని తెలుసుకుంటే వారి దూరాలోచనకు విస్తుపోతాం. విశాలాంధ్ర భావన తెలంగాణలో ఎన్నడూ లేదు. ఇది ప్రధానంగా సర్కారు జిల్లాల నుంచి వచ్చిన డిమాండ్. 1936లో ఆంధ్రా కాంగ్రెస్, స్వరాజ్య పార్టీలు తెలంగాణను కలుపుకొని ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశాయి. మామిడిపూడి వెంకటరంగయ్య 1937లో తెలుగు మాట్లాడే ప్రాంతమంతా కలిపి ఒకే ప్రదేశంగా ఏర్పాటుచెయ్యాలనే భావనను వ్యాప్తిచేశాడు. ఆ తర్వాత కడప కోటిరెడ్డి వారి సరసన చేరాడు. ఆ తర్వాత 1946లో పుచ్చలపల్లి సుందరయ్య విశాలాంధ్ర భావనను సిద్ధాంతీకరించి విశాలాంధ్రలో ప్రజారాజ్యం పుస్తకాన్ని ప్రచురించాడు. అప్పటికే కమ్యూనిస్టుల నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటం జరుగుతున్నందున తెలంగాణ కమ్యూనిస్టులు కూడా సుందరయ్య సిద్ధాంతాన్ని సమర్థించారు. 1949లో అయ్యదేవర కాళేశ్వరరావు నాయకత్వంలో విశాలాంధ్ర మహాసభ ఏర్పాటై అటు ఆంధ్రలో, ఇటు తెలంగాణలో విశాలాంధ్ర ప్రచారం చేయసాగింది. ఈ రకంగా సర్కారు జిల్లాలలో పుట్టిన విశాలాంధ్ర భావన మెల్లమెల్లగా తెలంగాణలో ప్రవేశించింది. అయితే విస్తృత ప్రజామోదం మాత్రం పొందలేకపోయింది. విశాలాంధ్ర మహాసభ హైదరాబాద్‌లో జరిపిన సమావేశాలు జనం లేక ప్రజాప్రతినిధుల హాజరు లేక వెలవెలబోయినాయని, బడి పిల్లలను కూచుండబెట్టి మమః అనిపించుకున్నారని బీఎన్ శాస్త్రి 1955లో 'రెండు తెలుగు రాజ్యాలెందుకు?' అన్న పుస్తకంలో రాశారు. ఈ రకంగా సమావేశాలు జరపడం దండుగని ఆంధ్ర నాయకులు అనుకున్నట్టుగా కూడా ఆయన పేర్కొన్నారు. 1952లో ఉధృతంగా కొనసాగిన నాన్ ముల్కీ గో బ్యాక్- ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమమే అందుకు సాక్ష్యం.




**1948 నుంచి 1952 దాకా హైదరాబాద్ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్నప్పుడు హైదరాబాద్ రాష్ట్ర ఉద్యోగాల్లోకి ముల్కీ నిబంధనలకు విరుద్ధంగా చొరబడిన నాన్ ముల్కీలను తరిమివేసేందుకు నాన్ ముల్కీ ఉద్యమం బద్దలైంది. 13 మంది విద్యార్థులు అమరులయ్యారు. అయినా కూడా నాన్ ముల్కీలు మాత్రం తెలంగాణ ఉద్యోగాల్లో దిగబడిపోయినారు.**

**వలస ప్రాంతంగా తెలంగాణ:** 1956లో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగినదేమిటో అందరికీ తెలుసు. నెహ్రూ చెప్పినట్టు ఆంధ్రుల సామ్రాజ్య విస్తరణ, వనరుల దోపిడీ నిరాఘాటంగా కొనసాగాయి. ఫజల్ అలీ కమిషన్ పేర్కొన్నట్టు తెలంగాణ ఆంధ్రకు వలస ప్రాంతంగా మారిపోయింది. అంతేకాదు, తన ప్రత్యేక భాషా సాంస్కృతిక అస్తిత్వాన్ని కూడా కోల్పోయింది. ఇవ్వన్నీ జరిగినయి కనుకనే నవంబరు 1 తెలంగాణకు విద్రోహ దినం. అయితే తెలంగాణకు ద్రోహులు ఎవరు? అన్నది కీలక ప్రశ్న. ఆనాడు ఉద్యమకారులు ఈ అంశాన్ని విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం మొదటి ద్రోహి. 60 ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం జరుగుతున్నా, తన తప్పును సవరించుకుందామన్న ఇంగితాన్ని చాలాకాలం మర్చిపోయింది కేంద్ర ప్రభుత్వం. సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ఉన్న అన్ని ప్రాతిపదికలను ధ్వంసం చేసి, తెలంగాణ వనరులను కొల్లగొట్టుకుపోతున్న ఆంధ్ర ప్రాంత పాలక వర్గాలు రెండో ద్రోహులు. తెలంగాణ వనరులపై, హైదరాబాద్ నగరంపై తమ భల్లూకపు పట్టును వదిలిపెట్టడానికి ఇష్టపడని ఆంధ్ర సంపన్నవర్గాలు, పెట్టుబడిదారులు 'కలసి ఉంటే కలదు సుఖమని' అనేవారు. తెలంగాణకు స్వయం పాలనను నిరాకరించేవారు. దోపిడికి అలవాటుపడిన వీరు తమ దోపిడి సొమ్ముతో కేంద్ర నాయకులను లోబర్చుకొని తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్నారు. ఇక మూడో రకం ద్రోహులు ఎవరంటే.. తెలంగాణ ఇంటి దొంగలు. తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధులు. ఆంధ్ర పాలకవర్గాల మోచేతి నీళ్లు తాగడానికి అలవాటుపడి తెలంగాణ తల్లికి ద్రోహం చేశారు. తెలంగాణ ప్రజలు ఎంత చీత్కరించినా, ఎంత అవమానించినా చూరుకు వేలాడే గబ్బిలాల లెక్క పదవులను పట్టుకు వేలాడారే తప్ప తెలంగాణ ప్రజలు చేస్తున్న పోరాటాలతో మమేకం కాలేదు. ఈ ముగ్గురు తెలంగాణ ద్రోహుల విద్రోహ రాజకీయాలు విజయం పొందిన రోజు కనుకనే నవంబర్ 1 తెలంగాణ ప్రజలకు ముమ్మాటికీ విద్రోహ దినమే.

విద్రోహ రాజకీయాలను ఓడించిన తెలంగాణ:
**అయితే ఎవరైతే విద్రోహ రాజకీయాలకు లొంగి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనానికి నిర్ణయం చేశారో వారి వారసులే 60 ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి, వందలాది మంది తెలంగాణ బిడ్డల త్యాగానికి భయకంపితులై ఉమ్మడి రాష్ట్ర విభజనకు నిర్ణయించడం ఒక చారిత్రిక వైచిత్రి. 1969 మలిదశ ఉద్యమం వైఫల్యాల నుంచి తెలంగాణ గుణపాఠాలు నేర్చుకున్నది. భావ ప్రచారం, ఉద్యమం, రాజకీయ ప్రక్రియ.. ఈ మూడు సమాంతరంగా నడవాలన్న సిద్ధాంత అవగాహనను ప్రొఫెసర్ జయశంకర్ విస్తృతంగా ప్రచారం చేశారు.**

ఆ వ్యూహంలో భాగంగానే రాజకీయ ప్రక్రియను ముందుకు తీసుకుపోవడానికి ఒక రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. భావ ప్రచారాన్ని, ఉద్యమాన్ని సమాంతరంగా నిర్వహించడానికి ప్రజా సంఘాలు ఏర్పాటైనాయి. దీంతో విస్తృత ప్రజానీకం ఉద్యమంలో భాగమైనారు. మలిదశ ఉద్యమంలో మహత్తర ప్రజా పోరాటాలు పెల్లుబుకినాయి. సహాయ నిరాకరణ, సకల జనుల సమ్మె, ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్, నెక్లెస్‌రోడ్‌లో జరిగిన సాగరహారం, మానుకోట పోరాటం, ఢిల్లీకి జరిపిన సాంసద్ యాత్ర, కేసీఆర్ నిరాహార దీక్ష సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా పది రోజుల పాటు ప్రజ్వరిల్లిన ప్రజా ఉద్యమం, వంటావార్పు, తెలంగాణ ప్రజా కళాకారుల ధూంధాం, పెల్లుబుకిన సాంస్కృతిక చైతన్యం, విద్యార్థుల పోరాటాలతో రగిలిపోయిన ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ విశ్వవిద్యాలయాలు, అన్నిటికీ తెగించి హక్కుల కోసం పోరాడిన తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పాటలు, కవిత్వం, కథలు ఇతర రూపాలలో ఆర్తితో వ్యక్తీకరించిన రచయితలు, కవులు, మేధావులు.. ఇవన్నీ తలచుకుంటే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వీటన్నిటిలో మనం కూడా భాగస్వాములమైనందుకు, మన కండ్లముందే ఉద్యమ ఆకాంక్ష నెరవేరినందుకు గర్వపడకుండా ఉండలేం. ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆనాటి విద్రోహ రాజకీయాలను తలచుకోవడం మనసును కష్టపెట్టే విషయం. అయినా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియ ఎన్ని క్లిష్టమైన దశలను దాటుకొని విముక్తమైనదో తెలుసుకోవడం కూడా స్ఫూర్తిదాయకమైనది. కొత్త తరానికి తెలపాల్సిన సందర్భం కూడా ఇదే.

# తెలంగాణ చరిత్ర యాత్రలో..



శ్రీరామోజు హరగోపాల్

**కొత్త తెలంగాణ చరిత్ర బృందం సాగించిన చరిత్ర యాత్రలలో చేసిన పరిశీలనలు, పరిశోధనలను చరిత్రలోని దశల ఆధారంగా, విషయం వారీగా సంక్షిప్తంగా తెలిపే ప్రయత్నం ఇది. తెలంగాణ చరిత్ర మరుగున పడ్డది. కొందరి మరుపున పడ్డది. ఎవరినీ నిందించే పనిలేదు. కానీ, తెలంగాణ చరిత్ర నిర్లక్ష్యం చేయబడ్డది. ఉపేక్ష వహించిన బాధ్యుల కారణంగా చాలా ఆలస్యంగా తెలంగాణ చరిత్ర వెలుగులోకి వచ్చింది. ఎంతోమంది Pride of History కోరుకోవచ్చు. కాని, దానిని Proud of Historyగా తమదని చెప్పుకొనే ఒరవడిలో ఇతర చరిత్రల పట్ల ఉదాసీనత చూపడమో, దాచేయడమో తగని పని. చరిత్ర 'దాచేస్తే దాగని సత్యం'.**

తెలంగాణ చరిత్ర పట్ల ఇష్టం, గౌరవాలతో చరిత్రకారులు, ఔత్సాహికులు సంఘటితంగా, సామూహికంగా చరిత్ర అన్వేషణలో స్వచ్ఛందంగా పాల్గొంటున్న సంస్థ 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం'. పిడికెడు మందితో మొదలై శతాధిక సభ్యులతో కొత్త తెలంగాణ చరిత్రను అన్వేషిస్తున్నది. గడిచిన 25 సంవత్సరాలలో చరిత్ర బృందం చేసిన క్షేత్ర పరిశీలనలు, పరిశోధనలు విలువైనవి. తెలంగాణ చరిత్రకు కొత్త పేజీలు చేర్చిన శోధనలు. చరిత్ర పూర్వయుగానికి సంబంధించిన ఎన్నో అన్వేషణలు చేసింది చరిత్ర బృందం. తెలంగాణలో చరిత్రకు ఆదరువులైన కపిలాయి గుహ (కొమరంభీం జిల్లా), మైలారం గుహలు (ములుగు జిల్లా), గాజుబేడం గుహలను (నల్గొండ జిల్లా) కొత్తగా గుర్తించింది.

తొలిసారిగా రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరున్నర కోట్ల ఏండ్ల కిందటి లావా స్తంభాలనే కాలామ్నార్ బసాలట్స్‌ని, నత్తగుల్లల, డైనోసార్ల, చెట్ల, ఆకుల శిలాజాలను వెలుగులోకి తెచ్చింది. జైపూర్‌లో సమ్మక్కగా పూజిస్తున్న జంతు ఉరఃపంజర శిలాజాన్ని బయటపెట్టింది. రాష్ట్ర పురావస్తు శాఖ గుర్తించిన 18 రాతి చిత్రాల తావులకు 50 రాతి చిత్రాల తావులను చేర్చింది ఈ చరిత్ర బృందం. వీటిలో మధ్య రాతియుగాల నుంచి చారిత్రక యుగాల దాకా వివిధ కాలాల వైవిధ్యభరితమైన పురా సాంస్కృతిక చిత్రాలున్నాయి. రాతి చిత్రాలున్న తావులలో మధ్యరాతియుగాల నాటి సూక్ష్మ రాతి పనిముట్లు విరివిగా లభించాయి. రాతి చిత్రాలను తావులవారీగా విశ్లేషించి ప్రకటించడమే కాకుండా, రాతి చిత్రాలను గీయడంలో వాడే పదార్థాలను గుర్తించడానికి రామన్ స్పెక్ట్రామీటర్‌ను మొదటిసారిగా వాడింది కొత్త తెలంగాణ చరిత్ర బృందం. రాతి చిత్రాలను గీయడానికి ఇనుప ఖనిజమైన హెమటైట్ వాడినట్టు గుర్తించి, పూనాలో రాశి జాతీయ రాతిచిత్రాల సదస్సులో పత్రసమర్పణ చేయడమైనది. తెలంగాణ రాతి చిత్రాలలో నెమళ్లు, తెలంగాణ రాతి చిత్రాలలో అమ్మ దేవతలు, లిపుల గుర్తింపు. రాతి చిత్రాలలో అంతర చిత్రాల చిత్రణ. రాతి చిత్రాలలో పెద్ద పులులు, ఏనుగులు, అడవి దున్నలు, ఇఱ్ఱులు, సంభోగ చిత్రాలు, మూపుర పుటెద్దులు, యుద్ధరంగంలో రథాలు, ఎద్దుల బండి, తేళ్లు, స్వస్తిక్, చేపలు, వేటగాళ్లు, ఆయుధాలు... రాతిచిత్రాల తావులను తులనాత్మకంగా పరిశోధించింది కొత్త తెలంగాణ చరిత్ర బృందం.



**తొలిసారిగా రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరున్నర కోట్ల ఏండ్ల కిందటి లావా స్తంభాలనే కాలామ్నార్ బసాలట్స్‌ని, నత్తగుల్లల, డైనోసార్ల, చెట్ల, ఆకుల శిలాజాలను వెలుగులోకి తెచ్చింది. జైపూర్‌లో సమ్మక్కగా పూజిస్తున్న జంతు ఉరఃపంజర శిలాజాన్ని బయటపెట్టింది. రాష్ట్ర పురావస్తు శాఖ గుర్తించిన 18 రాతి చిత్రాల తావులకు 50 రాతి చిత్రాల తావులను చేర్చింది ఈ చరిత్ర బృందం.**

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పెదరాతియుగపు సమాధులను వేల సంఖ్యలో గుర్తించింది. 72 అడుగుల అతిపెద్ద బంతిరాళ్ల సమాధిని నల్లగొండ జిల్లా ఎర్రగడ్డలగూడెంలో గుర్తించింది. భద్రాచలం ప్రాంతంలో కొరియాకు సరితూగే మెగాలిథ్స్‌ని గుర్తించింది. ప్రాక్చారిత్రక కాలానికి సంబంధించిన అమ్మదేవతలను పుల్లూరులో, సోమారంలో, సింగరాయకొండలో గుర్తించింది. ఇవి మరెక్కడా లభించనివి. నంగునూరులో కొత్త రాతియుగానికి చెందిన బంకమట్టి ఎద్దు తల, ఆకునూరు, నర్మెట, చేర్యాల, కొండపాకలో టెర్రకోట బొమ్మలు, గాజు పూసలు, మట్టి పూసలు, ఎముక పాచిక, రాతి పనిముట్లు సేకరించింది. వీటిలో నగ్నకబంధ వంటి అమ్మ దేవత శిల్పాలు, ఆంత్రోపోమార్ఫిక్ మెన్హర్లు, ఒక అడుగు ఎత్తున్న రాతికడ్డి అమ్మదేవత, మూడంగుళాల మట్టి అమ్మ బొమ్మలున్నాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు శాతవాహన పూర్వయుగం నుంచి అసఫ్‌జాహీల దాక వివిధకాలాల రాజవంశాల నాణేలను సేకరించారు. వాటిమీద పత్ర సమర్పణలు చేశారు. చారిత్రక యుగానికి సంబంధించిన కొత్త చారిత్రక విశేషాలను గుర్తించి, వెలుగులోకి తెచ్చింది చరిత్ర బృందం.

కోటి లింగాలలో శాతవాహన పూర్వయుగ కాలపు ఐదక్షరాల శాసనం, మొక్కట్రావుపేట మునులగుట్ట మీద రెండు బ్రాహ్మీలిపి శాసనాలు వెలుగులోకి తెచ్చింది. విష్ణుకుండినుల కాలం 2వ మాధవవర్మ రెండవ రాజధాని కీసరగుట్టలో తొలి తెలుగు శాసనం 'తొలుచువాన్డు' మీద ఒక పుస్తకం వేసింది. పాత మహబూబునగర్ జిల్లాలోని కృష్ణా నదీపరీవాహక ప్రదేశాలలో దేవాలయాలలోని ప్రతిమలను, వాటి కాలాలను నిర్ధారించి ప్రకటించింది. రాష్ట్రకూటుల కాలపు కొలనుపాక పాలకుడు శంకరగండరస కాలాన్ని నిర్ధారించే ఆమనగల్లు శాసనాన్ని వెలుగులోకి తెచ్చింది. వెల్మజాలలో కొత్త శాసనాన్ని పరిష్కరించింది. కళ్యాణీ చాళుక్యుల కాలానికి సంబంధించిన వందకు మించి దేవాలయాలను, వాటిలోని శిల్పాలను ప్రతిమాలక్షణ సహితంగా గుర్తించింది. కొత్త బౌద్ధ, జైన, కాలాముఖ, శిల్పాలను గుర్తించింది. శ్రీ ఉత్పత్తి పిడుగు, కంకాళధారి శాసనాలను సేకరించి, పత్రరచన చేసింది. కాకతీయులకు ఆ పేరెట్లా వచ్చిందో, కాకతి దేవత ఎవరో పరిశోధనాత్మకంగా నిరూపించింది. రుద్రమ మరణాన్ని నిర్ధారించే మూడవ శాసనాన్ని పరిష్కరించింది. తొలిసారిగా తెలంగాణ దేశం అని పేర్కొన్న శ్రీరంగం తామ్రశాసనం గురించి వెల్లడి చేసింది. కుతుబ్‌షాహీల కాలపు ఏదులాబాద్, వల్మిడి, నాగర్‌కర్నూలు శాసనాలను పరిష్కరించి, ప్రకటించింది. 93 కొత్త శాసనాలను సమకూర్చి కొత్త తెలంగాణ శాసనాలుగా ప్రచురించింది.

**(కొత్త తెలంగాణ చరిత్ర బృందం తరపున)**

## రైతున్నాడా..?

కరిగిపోతున్న కాలం వెంట
పరుగులు పెడుతున్నాడు
గిట్టుబాటు లేని గింజల మధ్య
బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాడు
చేయూత లేక విధి వెక్కిరిస్తే
సాగిలపడి మొక్కుతున్నాడు
అసలు రైతున్నాడా!

వెలిసిపోయిన ఆకాశం వైపు
మసకబారిన బతుకు వైపు
కళ్లు తేలేస్తూ చూస్తున్నాడు
పుచ్చిపోయిన కంకి మొదళ్లు నుంచి
రాలిపడుతున్న పిందెలా
ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు
చినుకు రాని చింత తలపైనెత్తుకుని
కునుకు లేని రాత్రుల్ని గడుపుతున్నాడు
పచ్చగుండాల్సిన సెలకల్లో
గులకరాళ్లు శబ్దం చేస్తుంటే
చెవులు మూసిపట్టి కూర్చున్నాడు
ఇంతకూ రైతున్నాడా!

రెక్కల కష్టం కేవలం
రెక్కలిరుసుకునే వరకే అని తెలిసి
పెడరెక్కలేసిన కోడిలా
చతికిలపడి పడుకుండిపోయాడు
ఏవీ ఆనాటి ఆనవాళ్లు
ఏవీ అలనాటి జ్ఞాపకాలు
రైతు ఊసే లేని ఏలికలో
గాలివాటానికి తట్టుకుంటూ
జీవచ్ఛవంలా బతికేస్తున్నాడు
అవును ఇంతకూ రైతున్నాడా!

విరిగిన నాగళ్ల చెంత కూర్చుని
మొద్దుబారిన కొడవళ్లతో
ఎండమావుల్ని నరుకుతున్నాడు
ఆపన్నహస్తం మడుచుకున్నాక
హస్తవాసి కొండెక్కిన దీపమైనాక
ఏ దారీ లేని ఒంటరి గమ్యంలో
ఒక్కడే తరలిపోతున్నాడు
ఇంతకూ రైతున్నాడా!

రైతుంటే ఆచూకీ తెలపండని
నేలకొరిగిన కంకి
పదేపదే అడుగుతోంది
చెదిరిపోయిన ధాన్యం రాశి
అన్ని దిక్కులా వెతుకుతోంది
పంట మొహం ఎరుగని భూమి
కన్నీటి పర్యంతమైంది
ఇంతకూ రైతున్నాడా!



నరెద్దుల రాజారెడ్డి
96660 16636

## ఒక్క పైసా అయినా రికవరీ చేశారా?



*కొన్ని వారాల ముందు వరకు 'రూ. 100 కోట్ల మద్యం కుంభకోణం' అని బీజేపీ నాయకులు చెప్పారు. ఇప్పుడు రూ. 1,100 కోట్ల స్కామ్ అని చెప్పడం మొదలుపెట్టారు. మరి ఆ డబ్బంతా ఎటు పోయింది? ఒక్క పైసా అయినా స్వాధీనం చేసుకున్నారా? నగలేమైనా దొరికాయా? అసలు ఈ కేసులో ఎటువంటి ఆధారాలు లేవు. కేవలం మమ్మల్ని అరెస్టు చేయడానికే మద్యం కుంభకోణాన్ని తెరపైకి తీసుకొచ్చారు.*

**- అరవింద్ కేజ్రీవాల్**, ఢిల్లీ ముఖ్యమంత్రి

